ప్రజాశక్తి
మంగళవారం 30 డిసెంబరు 2025
5

అల్లూరి సీతారామరాజు

ఆన్‌లైన్ కోచింగ్‌కు పరీక్షలు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: గ్రామీణ యువతకు పోలీసు ఉద్యోగాల్లో అవకాశాలను పెంచడానికి అరకువేలి పోలీస్ శాఖ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని సోమళవారం ప్రారంబించారు. పీసీ, ఎస్ఐ డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచితంగా ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు ఎస్ఐ గోపాల్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకులోయ మండలంలోని దరఖాస్తుదారుల నుంచి సుమారు 150 మంది అభ్యర్థులను ఎంపిక చేసి, అరకు పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అరకులోయ ఎస్ఐ జి.గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా కాకినాడలోని శ్యామ్ ఇన్‌స్టిట్యూట్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం, ఎంపికైన అభ్యర్థులకు త్వరలో ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ నిర్వహించబడుతుందని ఎస్ఐ తెలిపారు.

పోటో రైట్ ఆఫ్: మాట్లాడుతున్న ఎస్ఐ జి గోపాలరావు.

అశోక్‌తేజకు జ్ఞాపిక అందజేస్తున్న తపన్‌సేన్, వేదికపై కరీం, రామకృష్ణన్, సిహెచ్.నర్సింగరావు, రమాదేవి తదితరులు

ఆద్యంతం ఉత్సాహం..ఉత్తేజం

- మూడో రోజు 'శ్రామిక ఉత్సవ్'లో పండగ సందడి
- అభ్యుదయ, విప్లవ సినీ గీతాలాపన
- చైతన్యం నింపిన డాక్టర్ సుద్దాల అశోక్ తేజ
- ఎగ్జిబిషన్లు, పుస్తక ప్రదర్శనకు పోటెత్తిన ప్రజానీకం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సన్నద్ధంగా సాగర తీరంలో తలపెట్టిన 'శ్రామిక ఉత్సవ్' అత్యంత ఉల్లాసభరితంగా, ఉత్సాహపూరితంగా సాగుతోంది. నగరంలోని ఆర్‌కె బీచ్ ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ నెల 27న ప్రారంభమైన ఈ ఉత్సవ్ ప్రాంగణం రోజు రోజుకూ పండగ వాతావరణాన్ని సంతరించుకుంటోంది. మూడో రోజు సోమవారం సాయంత్రం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అధ్యక్షతన 'స్త్రీ పురుష సమానత్వం' థీమ్‌తో జరిగిన సభకు ముఖ్య అతిథిగా కవి, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ హాజరై అభ్యుదయ, విప్లవకర సినిమా పాటలు, అవి ఏ పరిస్థితులను బట్టి శ్రామిక గీతాలకు ప్రాధాన్యం ఇచ్చారన్న అంశాలను కళ్లకు కట్టినట్లు చెప్పడంతో సభికులంతా ఉత్సాహం, కరతాళ ధ్వనులతో ప్రతిస్పందించారు. శ్రామిక సంస్కృతిపై కార్పొరేట్ల దాడి నానాటికీ పెరుగుతోందని, 'రాజకీయ రౌడీ'లపై తాను నిరంతర రచనలు సాగిస్తూ ఉంటానని అన్నారు. అనేక సినీ అభ్యుదయ, విప్లవ గీతాలను అలవోకగా సభా వేదికపై ఆలపిస్తూ పాటలకు అర్థాన్ని చెబుతూ వినోదంతో పాటు విజ్ఞానం అందించడంతో సభికులంతా చప్పట్ల వర్షం కురిపించారు. మళ్లీ మళ్లీ శ్రమజీవుల సభలకు తాను వస్తూ ఉంటానని, ప్రతి ఏటా ఇలాంటి ఉత్సవాలు జరపాల్సిన అవసరం ఉందని అశోక్ తేజ వెల్లడించారు. సభకు ముందు అశోక్ తేజ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోగల బుక్‌స్టాల్స్ అన్నీ కలియతిరిగారు. సభికులందరినీ ఏకరీతిన ఆనందోత్సాహంలో ముంచెత్తుతూ మరో విశిష్ట అతిథి జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ పుస్తక మహోత్సవ స్టాల్స్‌ను స్వయంగా సందర్శించారు. పలు పుస్తకాలను గురించి సమాచారం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విశాఖ వంటి చోట్ల పుస్తక పఠన సంస్కృతిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు ఎస్ఆర్ శంకరన్ పుస్తకాన్ని కమిషనర్ స్వయంగా కొనుగోలు చేశారు. సైన్స్ ఎగ్జిబిషన్, ఫొటో ఎగ్జిబిషన్, షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనలూ ఎంతగానో ఆకట్టుకున్నాయి. పుస్తక ప్రదర్శనకు పుస్తక ప్రియులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

థింసా నృత్యం ప్రదర్శిస్తున్న అరకు గిరిజన కళాకారులు

సంప్రదాయ నృత్యంతో ఆకట్టుకున్న కేరళ కళాకారులు

అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

ఆరుచోట్ల ఏర్పాటు

5 వేల మెట్రిక్ టన్నులపైగా కొనుగోలు

ధాన్యం ఆరబెడుతున్న రైతులు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం విక్రయిస్తున్న రైతులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలో ఈ ఏడాది వరి ముమ్మరంగా పండిన నేపథ్యంలో వ్యవసాయాధికారులు వరి కోత కోయగానే కొనుగోలు చేసేలా ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. దానికి అనుగుణంగా మండలంలోని కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో ధాన్యం నూర్చిన వెంటనే స్థానికంగా వాటిని అమ్ముకునే వెసులుబాటు అన్నదాతలకు కలిగింది. ధాన్యం విక్రయాల్లో గతంలో అన్నదాతలు పడిన ఇబ్బందులు ఈసారి తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. దీనిలో భాగంగా కొనుగోలు ఏజెన్సీల ఎంపిక కసరత్తు పూర్తి చేసారు.నవంబర్ మూడో వారంలో మండలంలోని 6 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండలంలోని ఈ ఏడాది 3,175 మంది రైతులు 7,004 ఎకరాల్లో ఎంటియు,1318, ఏంటియు1064, ఆర్‌జెఎల్, బిపిటి, 5204 రకాలు వరి సాగు చేపట్టారు. ఈ ఏడాది మండలంలోని 13 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని వ్యవసాయ శాఖ అంచనా. సాధారణ రకం ధాన్యం రూ.2369 కాగా, ఏ గ్రేడ్ సన్నరకాలు రూ.2,389 క్వింటాకు ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించింది. గత ఏడాది 4,700 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించగా, ఈ ఏడాది వరి పంట పెరిగిన నేపథ్యంలో 5వేల మెట్రిక్ టన్నులు పైగా ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు వ్యవసాయాధికారి చక్రధర్ తెలిపారు. ధాన్యం సేకరణకు రైతులకు1,25,000 గోనె సంచీలు కావలసి ఉండగా, ఇప్పటివరకు సుమారు 50 వేలకు పైగా గోనె సంచులు రైతులకు అందజేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకూ కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 85 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్లు ఎఒ చక్రధర్ తెలిపారు. గోనెసంచులు సకాలంలో రాకపోవడంతో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు చొరవతో కొంతమేర సమస్య పరిష్కారమైంది. మిల్లర్స్ నిబంధనల ప్రకారం తేమ 17 శాతం కన్నా తక్కువగా ఉన్న ధాన్యం మాత్రమే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. మిల్లర్స్ టార్గెట్ పూర్తి కావడంతో మిల్లర్స్ గోనె సంచులు సకాలంలో ఇవ్వకపోవడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైతులు కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేసి అక్కడే లారీలో లోడ్ చేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు. రైతులు వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో వారి ఖాతాలో డబ్బులు జమ అవ్వడం జరుగుతుందని తెలిపారు.

దళారీల మోసంతో ప్రభుత్వ కేంద్రాలపై ఆధారపడ్డ రైతులు

ధాన్యం ప్రైవేట్ కొనుగోలుదారులను కొంతమంది రైతులు ఆశ్రయించడంతో దళారీలు ఎక్కువ ధాన్యాన్ని పట్టి తక్కువ తూకం చూపించటం, తక్కువ ధర చెల్లించడం, పెట్టుబడి పేరుతో రైతులను మోసం చేయడం వంటి కారణాలతో ఈ ఏడాది రైతులు దళారీల వద్దకు వెళ్లడం మానేశారు. ఎక్కువ మంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించారు.

వీడని మంచు..ఆరని ధాన్యం..

మిల్లర్స్ తేమ శాతం 17 శాతం కన్నా తక్కువగా ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని నిబంధన విధించిన నేపథ్యంలో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఉదయం 11 గంటల వరకు దట్టంగా మంచు కురుస్తోంది. రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోతున్నాయని, ఒక్కొక్క చోట ధాన్యం ఆరబెట్టి వారం రోజులు అవుతున్నా తేమ శాతం తగ్గేందుకు ఇంకా ఆరబెడుతూనే ఉన్నారు. తేమ శాతం సడలింపు ఉంటే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని రైతుల అభిప్రాయపడుతున్నారు.

సబ్సిడీపై రుణాలు ఇవ్వాలి

ఏజెన్సీలో రైతులు నిరుపేద వర్గానికి చెందిన వారైన నేపథ్యంలో వారికి ప్రభుత్వం సబ్సిడీపై రుణాలు ఇవ్వాలి. ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు గిరిజన,పేద రైతులకు సబ్సిడీపై అందజేయాలి. ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు సకాలంలో డబ్బులు వారి ఖాతాలో జమ చేయాలి.

- కోండ్ల సూరిబాబు, గిరిజన సంఘం మండల కార్యదర్శి

ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు

ప్రభుత్వం ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తాం. రైతులకు బ్యాంకులు, సొసైటీ ద్వారా లోన్ సదుపాయం కల్పించడం జరుగుతుంది. దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయించాలి. ప్రస్తుత రబీలో అపరాల సాగు చేసుకోవాలి. ఇప్పటికే రైతులకు పూర్తిస్థాయి సబ్సిడీపై విత్తనాలు అందించాం.

- చక్రధర్, వ్యవసాయాధికారి

గోనెసంచులు అందించాలి

రైతులకు అనువుగా సకాలంలో గోనెసంచులు అందజేయాలి. గోనెసంచులు అందిస్తున్నారు కానీ సకాలంలో అందడం లేదు. తేమశాతం నిబంధన సడలించాలి. ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో నగదు జమ చేయాలి.

- మిరియాల తవడయ్య, రాజఒమ్మంగి

సిపిఎం నేతలపై అక్రమ కేసులు అన్యాయం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అనకాపల్లి జిల్లా సీపీఎం నాయకుడు ఎం.అప్పలరాజుపై అక్రమంగా పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపడాన్ని నిరసిస్తూ నక్కపల్లిలో నిర్వహించిన బంద్ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు లోకనాథం, సహా పలువురు నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర తీవ్రంగా ఖండించారు. స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన, అరెస్టు చేసిన సీపీఎం నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎం.అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్ట్ కేసులను రద్దు చేసి ఆయనను తక్షణమే విడుదల చేయాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం సీపీఎం నాయకులపై పీడీ యాక్ట్ వంటి అక్రమ కేసులు పెట్టి ప్రజా ఉద్యమాలను అణిచివేయడానికి ప్రయత్నిస్తోందని కిల్లో సురేంద్ర విమర్శించారు. ఇటువంటి అణచివేత చర్యలను ప్రజలు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

పాడేరు: అనకాపల్లి జిల్లాలోని వివిధ మండలాల్లో సోమవారం చేపట్టిన బంద్ పై పోలీసుల నిర్బంధం తగదని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి అప్పలనరస ఖండించారు. సిపిఎం నేతలు, నక్కపల్లి ప్రజల అక్రమ అరెస్టుల పై తీవ్రంగా వ్యతిరేకించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, రైతు నాయకుడు సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టి అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అనకాపల్లి జిల్లా ఎస్ రాయవరం, నక్కపల్లి మండలాల్లో సోమవారం జరిగిన బందులో పాల్గొన్న సిపిఎం శ్రేణులను, సాధారణ ప్రజలపై తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించి అక్రమ అరెస్టు చేయడంపై ఆయన తీవ్రంగా ఖండించారు. అక్రమ భూసేకరణకు వ్యతిరేకంగా ప్రజల తరపున నిలబడి పోరాడుతున్న అప్పలరాజును చట్ట విరుద్ధంగా అరెస్టు చేయడమే కాకుండా దానికి నిరసనగా బంద్ పాటిస్తున్న ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయడం, నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. రైతుల భూములను అక్రమంగా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చట్టాలను తుంగలో తొక్కి అధికారం దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా పోరాడుతున్న రాజయ్యపేట గ్రామస్తులను మభ్య పెట్టి భూములు స్వాధీనం చేసుకోవాలని చేస్తున్నారన్నారు.. బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీని పెట్టబోమని నోటి మాటగా హామీ ఇచ్చినా ముఖ్యమంత్రి ఆ మేరకు నోటిఫికేషన్ ను ఉపసంహరించు కోక పోవడం వారి కపట నీతిని ఎత్తిచూపుతున్నదన్నారు. వారి కుట్రలకు అడ్డుగా నిలుస్తున్నారని కక్షతోనే అప్పలరాజుపై పీడీ యాక్టు ప్రయోగించారన్నారు.

పీడి చట్టం ఉపసంహరించుకోవాలి

డుంబ్రిగుడ: నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న సిపిఎం నేత అప్పలరాజుపై పెట్టిన పిడి యాక్ట్ కేసును వెంటనే ఉపసంహరించు కోవాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ బి పోతురాజు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రజా సమస్యల మీద నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడు అప్పలరాజని ,అతనిపై కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా పీడి చట్టం ఉపయోగించి అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపించడం దుర్మార్గమన్నారు. భూములు కోల్పోతున్న పేద రైతులు, దళిత, గిరిజన బలహీన వర్గాల వారి కోసం పోరాడుతున్న నాయకుడు అప్పల రాజన్నారు. అరాచకాలకు పాల్పడుతున్న గూండాలు, దొంగలు, మాదక ద్రవ్య నేరస్తులు, స్మగ్లర్లు, భూకబ్జాదారులపై పీడిచట్టం పెట్టకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ప్రజా నాయకుడిని ఈ చట్టం ఉపయోగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.తక్షణమే కూటమి ప్రభుత్వం పునరాలోచించి అప్పలరాజు పై పెట్టిన పీడి చట్టం ఉపసరించుకోని ఆయనకు బేసరత్తుకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు .లేని పక్షంలో పేద ప్రజలంతా ఏకమై భారీ ఎత్తున కూటమి ప్రభుత్వంపై ఉద్యమించవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు.

ఆశ్రమపాఠశాల విద్యార్థిని మృతిపై విచారణ

విచారణ చేస్తున్న ఇన్‌చార్జి ఎటిడబ్ల్యూ వినాయకరావు

ఎటిడబ్ల్యూతో మాట్లాడుతున్న ఎంపిటిసి బుజ్జిబాబు

ప్రజాశక్తి -సీలేరు:

జికె వీధి మండలం సీలేరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని నందిని ఆదివారం మృతి చెందిన విషయం విధితమే. ఈ మేరకు జికె వీధి మండలం ఇన్‌చార్జి ఎటిడబ్ల్యూ వినాయకరావు సోమవారం బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టి విద్యార్థిని మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. శనివారం నందిని జ్వరం వచ్చినట్లు ఉందని తెలపడంతో వార్డెన్ నాగశకుంతల వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారని వైద్యపరీక్షల అనంతరం తిరిగి పాఠశాలకు తీసుకువచ్చారని విద్యార్థులు తెలిపారు. ఆదివారం ఉదయం వార్డెన్ టిఫిన్ తినిపించి ఆసుపత్రికి వెళ్దామని చెప్పారన్నారు. కొంత సమయం తర్వాత నందిని కళ్లు తిరిగి పడిపోవడంతో అంబులెన్స్ పంపించాలని పిహెచ్‌సికి సమాచారం ఇచ్చారని, వెంటనే అంబులెన్స్ రాలేదని, దాంతో వార్డెనే స్వయంగా ఆసుపత్రికి తీసుకువెళ్లారని, డాక్టర్ నారాయణరావు పరిశీలించి అప్పటికే ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారని తెలిపారు. అనంతరం ఎటిడబ్ల్యూ వైద్యాధికారి నారాయణరావు, సిబ్బందితో మాట్లాడిన అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థిని మృతిపై పూర్తి స్థాయి విచారణ చేశానని నివేదికను జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, ఉన్నతాధికారులకు పంపుతానని ఆయన తెలిపారు.

వైద్యాధికారి నిర్లక్ష్యం వల్లనే మృతి : ఎంపిటిసి బుజ్జిబాబు

సీలేరు పిహెచ్‌సిలో శనివారం వైద్యాధికారి నారాయణరావు విధుల్లో లేకపోవడమే నందిని మృతికి కారణమని గాలికొండ ఎంపిటిసి (సిపిఎం) అపరంగి బుజ్జిబాబు ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం నందినిని ఆసుపత్రికి తీసుకువచ్చినప్పుడు వైద్యాధికారి ఉండి ఉంటే అంబులెన్స్ పంపించేవారన్నారు. ఆదివారం ఉదయం కూడా నందిని ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో అంబులెన్స్ పంపించాలని ఆసుపత్రికి ఫోన్ చేస్తే పంపించలేదన్నారు. ఆయన విధులు సక్రమంగా నిర్వహించడం లేదని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఆయనతో పాటు హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథ కూడా తరచూ విధులకు డుమ్మ కొడుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రెగ్యులర్ వైద్యాధికారిని నియమించకపోవడం వైద్యఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే ఇటువంటి పరిణామాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటిడి పిఒ, డిఎంహెచ్ఒ స్పందించి రెగ్యులర్ వైద్యాధికారులను తక్షణమే నియమించి విధులు పట్ల అలసత్వంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నందిని కుటుంబసభ్యులకు పరామర్శ

గాలికొండ పంచాయతీ నిమ్మగొంది గ్రామానికి చెందిన నందిని కుటుంబ సభ్యులను బుజ్జిబాబు పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఇన్‌చార్జి ఎటిడబ్ల్యూ వినాయకరావు, వార్డెన్ నాగశకుంతలతో మాట్లాడి నందిని మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. జికె వీధి ఎంపిపి బోయిన కుమారి, గాలికొండ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు, దేవరపల్లి ఎంపిటిసి కృష్ణమూర్తి, సిపిఐ నాయకుడు విష్ణుమూర్తి, కవర్ల భగవాన్, రాంబాబు, దారకొండ పీసా, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులపై సత్వర చర్యలు

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు పై జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ తో కలసి సోమవారం జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల ప్రస్తుత స్థితిగతులను, వాటిపై తీసుకున్న చర్యలను ఎస్పి అమిత్ బర్దర్ వివరించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వీలైనంత త్వరగా బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇతర అధికారులతో కలిసి మండల స్థాయి కమిటీలు ఏర్పడి ప్రతి నెలా చివరలో సమావేశమై, గ్రామాలలో ఉన్న సమస్యల తీవ్రతను బట్టి , నమోదైన ఫిర్యాదులను, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను, భూ వివాద సమస్యలను సంబంధిత ఫిర్యాదుదారుతో చర్చించి పరిష్కరించాలని సూచించారు.క్షేత్రస్థాయి పర్యవేక్షణలో అధికారులు గ్రామాలను సందర్శించి ఎక్కడైనా వివక్ష లేదా అట్రాసిటీ కేసులు ఉంటే వాటిని గుర్తించి తక్షణమే పరిష్కార దిశగా అడుగులు వేయాలన్నారు. ఎఫ్.ఐ.ఆర్ నమోదైన వెంటనే చట్టపరమైన గడువులోగా విచారణ పూర్తి చేయాలని, అవగాహన సదస్సులు ఎస్సీ, ఎస్టీ హక్కులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి వివాదాలను పరిష్కరించాలని సూచించారు.

కమిటీ సభ్యులు వంతల దేవదాస్, కుర్ర సీతారాం , సేందరి లోహితాస్యుడు మాట్లాడుతూ చింతపల్లి, అరకు, భూ సంబంధ సమస్యలపై కేసులు నమోదవుతున్నాయని వివరించారు. ఈ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్, ఐటిడి ప్రాజెక్టు అధికారి తిరుమని శ్రీ పూజ, డి.ఎస్.పి ఆర్ ఆర్ వి ఎస్ అభిషేక్,సాంఘిక సంక్షేమ అధికారిని, ట్రైబల్ వెల్ఫేర్ ప్రసంచాలకులు, కార్మిక శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారి, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి, మండల తహసిల్దార్లు, పోలీస్ కమిటీ మెంబర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తనిఖీలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఉపాధ్యాయుల బాధ్యతగా విధి నిర్వహణతోనే గిరిజన విద్యాభివృద్ధి సాధ్యపడుతుందని మండల విద్యాశాఖ అధికారి-2 గెన్ను అన్నారు. మండలంలోని మారుమూల సావ్వా ప్రాథమిక పాఠశాలలో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు బోధన తీరును అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. బోర్డుపై గుణింతాలు బోధించారు. ఉపాధ్యాయులు సకాలంలో విధి నిర్వహణ చేపట్టి చిన్నారులకు నాణ్యమైన విద్యనందించి వారి పురోగాభివృద్ధికి తోడ్పాటునివ్వాలని ఆయన ఆదేశించారు. మండల కేంద్రంలోని గవర్నమెంట్ హైస్కూల్, వంతర్డ పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అర్జున్ పాల్గొన్నారు.

గర్భిణికి సుఖ ప్రసవం

తల్లీ, బిడ్డా క్షేమం

ప్రజాశక్తి -సీలేరు: జికెవీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ రాళ్లగెడ్డ గ్రామానికి చెందిన కిలో భగవతి పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో తన భర్త, బంధువులు సీలేరు పిహెచ్‌సికి సోమవారం తీసుకొచ్చారు. వైద్యాధికారి నారాయణరావు స్పందించి వెంటనే వైద్యసేవలు అందించారు. మగశిశువు జన్మించాడు. అయితే శిశువు ఉమ్మనీరు తాగేయడంతో డాక్టర్ ఉమ్మనీరు బయటికి తీశారు. అయినప్పటికీ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. చింతపల్లి దూరప్రాంతమని వెళ్లేందుకు వారు నిరాకరించారు. దీంతో ఎస్సై యాసీన్‌కు వైద్యాధికారి సమాచారం అందించారు. ఎస్ఐ యాసీన్ వెంటనే ఆసుపత్రికి వచ్చి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. పుట్టిన బిడ్డ, చిన్నపిల్లల వైద్యనిపుణుల పర్యవేక్షణలో ఉండాలని వారికి నచ్చజెప్పారు. ఎట్టకేలకు భగవతి భర్త రమేష్ వారి బంధువులు ఒప్పుకోవడంతో అంబులెన్స్ ఏర్పాటు చేసి చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ యాసీన్ తెలిపారు.



అంబులెన్స్‌లో భగవతిని తరలిస్తున్న వైద్యసిబ్బంది

పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలి

జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:పరిశ్రమల ఏర్పాటులో అధికారులు ప్రత్యేక చొరవ చూపించి పరిశ్రమల యాజమాన్యాలకు సహాయ సహాయకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్ గా మాట్లాడుతూ, పరిశ్రమల ఏర్పాటు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల పరిశ్రమలను ఏర్పటు చేయుటకు జిల్లాకు 250 ఎకరాలు ప్రభుత్వం భూ కేటాయింపు చేయడం జరిగిందన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నరు. పర్యాటక ప్రాంతాలైన అరకు, పాడేరు, మారేడుమిల్లి ప్రాంతాలలో కార్ వ్యాన్‌లు , రిసార్ట్స్ , కాటేజీల, ఆటల పార్క్ ల నిర్మాణాలకు భూ సేకరణ చేపట్టి , గ్రామ సభల తీర్మానాల ద్వారా గ్రామ పంచాయతీల నుండి ఆమోదం తీసుకొని సంబందిత యాజమాన్యాలకు అప్పగించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు వేగముగా మంజూరు చేయాలనీ అధికారులను ఆదేశించారు. చింతపల్లి, రంపచోడవరం నియోజకవర్గం గంగవరం లో ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్కులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, మౌలిక వసతుల కల్పన వేగవంతం చేయాలన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులుకు, స్వయం సహాయక సంఘాలకు నైపుణ్య శిక్షణలు, వర్క్ షాప్‌లు, శిక్షణలు ఇప్పించాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంలో భాగంగా శిక్షణ పొందిన అభ్యర్దులు ఉపాధి పొందుటకు రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలనీ బ్యాంకు అధికారులను ఆదేశించారు . ఈ కార్యక్రమంలో జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి, రంపచోడవరం ఐటిడిఏ పివో స్మరన్ రాజ్ , చింతూరు ఇంచార్జ్ పివో శుభం నోఖ్వాల్ , పాడేరు ఐటిడిఏ ఇంచార్జ్ ఆర్డివో ఎంవిఎస్ లోకేశ్వరరావు , జిల్లా పరిశ్రమల అధికారి రమణారావు , జిల్లా వ్యవసాయ అధికారి నందు , లీడ్ బ్యాంకు మేనేజర్ మాతు నాయుడు, డిఆర్ డిఏ పిడి మురళి, పరిశ్రమల శాఖ అధికారులు , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- ఎస్‌పి అమిత్ బర్దర్

ప్రజాశక్తి-పాడేరు:జిల్లాలో ప్రజల శాంతిభద్రతలే ప్రధాన లక్ష్యంగా నేరాల నియంత్రణ అణచివేత పై పటిష్ట చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడించారు. స్థానిక పోలీస్ సూపరిండెంట్ కార్యాలయంలో సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ అధికారులతో వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముందస్తు ఇంటెలిజెన్స్ సమాచారం, నివారణ చర్యలు, తక్షణ స్పందన, వ్యూహాత్మక ప్రాంతాల్లో బలగాల మోహరింపు, సమర్థవంతమైన బీట్ వ్యవస్థ, ప్రత్యేక డ్రైవ్‌లు, విజిబుల్ పోలీసింగ్, ఆధునిక సాంకేతికత వినియోగం, ఇతర శాఖలతో సమన్వయంతో జిల్లాలో శాంతి భద్రతలు పూర్తిగా నియంత్రణలో ఉన్నాయని ఎస్పీ తెలిపారు. నేరాలకు సంబంధించి గత సంవత్సరంతో పోలిస్తే 2025లో మొత్తం కేసులు 34శాతం తగ్గాయన్నారు. దోపిడీలు, దొంగతనాలు, మహిళలపై నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఎన్‌డిపి ఎస్‌ఐ పిసి తదితర అన్ని విభాగాల్లో గణాంకాలు నమోదు చేయబడ్డాయన్నారు. ఎన్‌డిఎస్ చట్టం కింద 2025లో 135 కేసులు నమోద యాయని,14,484.38 కిలోల గంజాయి, హషీష్ ఆయిల్: 35.61 కిలోలు పట్టుబడినట్లు తెలిపారు. 358 మంది నిందితులను అరెస్ట్ చేశామని వెల్లడించారుడ్రోన్లు, మానవ గూఢచారుల సహాయంతో 138 గ్రామాల పరిశీలన చేయగా గంజాయి సాగు ఎక్కడ గుర్తించబడలేదని, 325 కుటుంబాలకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనకు 29,841 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు వంటి తోడ్పాటు చర్యలు అందించినట్లు తెలిపారు. 30,005.65 కిలోల గంజాయి, 35.26 కిలోల హషీష్ ఆయిల్ దగ్ధం చేశామని, 4.41 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనం, 41 పిట్ ఎన్డిపిఎస్ కేసుల ప్రతిపాదన, 11 కేసుల్లో శిక్షలు ఖరారు అయినట్లు తెలిపారు.జిల్లాలో మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయన్నారు. గత ఏడాదితో పోలిస్తే రోడ్డు ప్రమాదాలు 14శాతం తగ్గాయని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా 2025 సంవత్సరంలో 843 కేసులు పరిష్కరించామని తెలిపారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో సోమవారం అవయవ దానంపై వాకర్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ గూడూరు సీతామాలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై అవయవ దానంపై అవగాహన కల్పించారు.

వైద్యులు లేక అందని సేవలు

- ఒకరు డెప్యుటేషన్,మరొకరు గైర్హాజరుతో సేవలు మృగ్యం
- పెదబయలు పిహెచ్‌సిలో గిరిజన రోగుల అవస్థలు



డాక్టర్ గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీ

ప్రజాశక్తి-పెదబయలు : వైద్యఆరోగ్యశాఖ నిర్వాకం, పర్యవేక్షణాలోపం వల్ల పెదబయలు పిహెచ్‌సిలో వైద్యసేవలు మృగ్యమౌతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులు ఉన్నా సోమవారం సంతోషాలు ఒక్కరు కూడా విధుల్లో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడక తప్పలేదు. దీంతో కిందిస్థాయి వైద్యసిబ్బంది అందించిన సేవలతోనే రోగులు సరిపుచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై గిరిజన ప్రాంతంలో వైద్యసేవల పట్ల సంబంధిత శాఖ యంత్రాంగం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో స్పష్టమౌతొందని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై అందిన సమాచారం మేరకు ప్రజాశక్తి పిహెచ్‌సికి వెళ్లి పరిశీలన జరిపితే వైద్యసేవల్లో డొల్లతనం వెలుగులోకి వచ్చింది.

పెదబయలు పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యాధికారులను నియమించినప్పటికీ, వారిలో డ్రాయింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న డాక్టర్ గొర్లె నిఖిలేష్ కిలగాడ పిహెచ్‌సికి డెప్యుటేషన్ వేయగా, మిగిలిన మహిళా వైద్యాధికారి డాక్టర్ సత్యశ్రీ సేవలే దిక్కుగా మారాయి. అయితే సోమవారం సంతోషాలు డాక్టర్ సత్యశ్రీ విధులకు రాకపోవడంతో వైద్యసేవలకు వచ్చిన రోగులకు ఇబ్బందులు తప్పలేదు. దీనిపై ఆరా తీస్తే డాక్టర్ సత్యశ్రీ మూడురోజులుగా విధులకు రావడం లేదని తెలిసింది. దీంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యాధికారి ఖాళీ కుర్చీయే దర్శనమిచ్చింది. దీంతో తీవ్ర అనారోగ్యంతో వచ్చిన రోగులను స్టాఫ్‌నర్స్, ఇతర కిందిస్థాయి సిబ్బంది పరిశీలించి, వారిని మెరుగైన వైద్యసేవలకు కోసం పాడేరు జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఇక స్థానిక గిరిజన బాలుర హాస్టల్ విద్యార్థులు ఆదురుగు అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆసుపత్రికి రాగా, వారికి కూడా కిందిస్థాయి సిబ్బంది సేవలే దిక్కుగా మారాయి.

రికార్డుల్లో ఇద్దరు వైద్యాధికారులు ఉన్నప్పటికీ, విధుల్లో ఒక్కరూ లేకపోవడంతో ప్రస్తుతం జ్వరాల సీజన్‌లో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. ఆదివారం రాత్రి ఒక డెలివరీ కేసు రాగా, కిందిస్థాయి సిబ్బంది ప్రసవం చేయించారు .అంతా సజావుగా సాగడంతో తల్లీబిడ్డ ఇద్దరు క్షేమంగా బయటపడినప్పటికీ, ఏదైనా క్రిటికల్ అయితే పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మాతాశిశుమరణాలు లేకుండా చేయాలని ప్రభుత్వాలు కృతనిశ్చయంతో ఉండి, ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సాహిస్తున్న పరిస్థితుల్లో డెలివరీకి పిహెచ్‌సికి వచ్చిన గర్భిణీకి అవసరమైన వైద్యసేవలకు కిందిస్థాయి సిబ్బంది శరణ్యమైతే ఎలాగని పలువురు అంటున్నారు.

పెదబయలు పిహెచ్‌సిలో వైద్యాధికారుల సేవలు అందుబాటులో లేకపోవడంపై వివరణాలు తెలుసుకునేందుకు డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కృష్ణమూర్తిని ఫోనులో సంప్రదించినా ఆయన అందుబాటులో లేరు. ఇప్పటికైనా జిల్లా ఆరోగ్యశాఖ యంత్రాంగం స్పందించి, పెదబయలు పిహెచ్‌సిలో వైద్యసేవలు దుస్థితిపై దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్యానికి వచ్చిన హాస్టల్ విద్యార్థులు

ఆర్గానిక్ కాఫీకి గిట్టుబాటు ధరలు చెల్లించాలి

- బెర్రీ బోరర్ నష్టానికి తక్షణమే పరిహారం ఇవ్వాలి
- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అంతర్జాతీయ మార్కెట్‌లో అరకు ఆర్గానిక్ కాఫీకి మంచి గిరాకీ ఉందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పగా ప్రకటిస్తున్నప్పటికీ, వాస్తవంగా ఆదివాసీ కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు అందడం లేదని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ అన్నారు. సోమవారం అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పాడేరు ఐటిడిఏ పరిధిలో పండిస్తున్న ఆర్గానిక్ కాఫీకి పార్చ్‌మెంట్ కిలోకు రూ.600, చెర్రీ కాఫీకి రూ.300, పండు కాఫీకి రూ.150 చెల్లించాలని డిమాండ్ చేశారు. అరకు ఆర్గానిక్ కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉన్నప్పటికీ, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు, పాడేరు ఐటిడీఏ, కాఫీ బోర్డు రైతులకు గిట్టుబాటు ధరలు చెల్లించడం లేదని ఆరోపించారు. ఇటీవల అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ప్రకటించిన ధరలు పార్చ్‌మెంట్ కాఫీకి రూ.450, చెర్రీ కాఫీకి రూ.270, పండు కాఫీకి రూ.70 మాత్రమే ఉండటంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని తెలిపారు.అరకువేలి మండలం చినలబుడు, చొంపి, పెదలబుడు, కొత్తబల్లుగుడ, డుంబ్రిగుడ మండలాల్లో సుమారు రెండు వేల మంది ఆదివాసీ కాఫీ రైతులు, దాదాపు మూడు వేల ఎకరాల్లో బెర్రీ బోరర్ తెగులుతో తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ప్రభుత్వం ఎకరాకు రూ.5 వేల నష్టపరిహారం ఇస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు చెల్లించలేదని, కనీసం ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాడేరు ఐటిడీఏ ద్వారా అందించాల్సిన ప్రోత్సాహకాలు కూడా రైతులకు అందడం లేదని విమర్శించారు. 2023-2025 మధ్య కొత్తగా కాఫీ నాటిన సుమారు 22 వేల మంది రైతులకు, 30 వేల ఎకరాల్లో నిర్వహించిన పనులకు చేసినప్పటికీ, వీటికి సంబంధించిన ప్రోత్సాహక నిధులు ఇంకా జమ కాలేదన్నారు. ఒక్కో రైతుకు ఎకరాకు రూ.9,000 చొప్పున మూడు సంవత్సరాల ప్రోత్సాహకాలు కలిపి సుమారు రూ.2 వేల కోట్ల వరకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని తెలిపారు.గతంలో ప్రోత్సాహక బకాయిలు రూ.67 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని అధికారులు చెప్పినా ఇప్పటివరకు అమలు కాలేదని ఆరోపించారు. తక్షణమే ఆదివాసీ కాఫీ రైతుల ఖాతాల్లో బకాయిలు జమ చేయాలని, లేదంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు గెమ్మెలి చిన్నబాబు, జి.బుజ్జిబాబు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : పలువురికి గాయాలు

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి ఘాట్ రోడ్డులో ఆటో బోల్తా పడిన ఘటనలో పలువురు గాయాల పాలయ్యారు. మండల స్పెషల్ ఆఫీసర్, సర్వ శిక్ష ఎపిసి స్వామి నాయుడు బాధితులను ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటారు అనంతగిరి. అరకు ప్రముఖ పర్యాటక కేంద్రంను తిలకించేందుకు విజయవాడ ప్రాంతం నుండి 9 మంది కుటుంబ సభ్యులు వచ్చారు. సోమవారం తిరుగు ప్రయాణంలో ఎగువ శోభ పంచాయతీ పరిధి కాఫీ ప్లాంటేషన్ సమీపంలో ఆటో బోల్తా పడింది. అందులో ఉన్న తొమ్మిది మంది ప్రయాణికులు గాయాలపాలయ్యారు. అటుగా వెలుళుతున్న అధికారి దగ్గరుండి వైద్యం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వాహనంలో తరలించి మానవత్వం చాటుకున్నారు.

పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -అనంతగిరి :మండల కేంద్రం అనంతగిరి బాలుర కొత్తవలస పాఠశాలలో కొరవడుతున్న సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం ద ష్టికి తీసుకువెళ్లి క షి చేస్తామని సర్వ శిక్ష అభియాన్ జిల్లా అధికారి స్వామినాయుడు తెలిపారు. పాఠశాలలో మెరుగైన వసతి సౌకర్యాలు లేక పోవడంపై జెడ్పిటిసి గంగరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు మేరకు సోమవారం. సర్వ శిక్ష అభియాన్ జిల్లా అధికారి సోమినాయుడు జెడ్పిటిసి గంగరాజులు సందర్శించారు. 50 మంది విద్యార్థులకు యూనిఫాం, బూట్లు నేటి వరకు తమకు అందలేదని ఫిర్యాదు చేయడంతో మండల విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో ఉన్న హాస్టల్ వసతి భవనం పూర్తిగా శిథిల వ్యవస్థకు చేరుకుందని దీనిపై ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి మరమ్మతులు లేదా పూర్తిస్థాయి భవనం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అప్పలస్వామి, ధర్మ పాల్గొన్నారు.

మహాసభ జయప్రదానికి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- చింతపల్లి : సిఐటియు అఖిలభారత మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం చింతపల్లి మండల కేంద్రంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ, ఈ నెల 31 నుంచి వచ్చేనెల 4 వరకు రాష్ట్రంలోనే తొలిసారిగా విశాఖపట్నం వేదికగా సిఐటియు అఖిల భారత మహాసభ జరగనుందన్నారు. ఈ మహాసభకు ఆరు దేశాల నుంచి అంతర్జాతీయ ప్రతినిధులతోపాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి కార్మిక పోరాటాల్లో పాల్గొన్న నాయకులు, 2,000 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. మహాసభల సందర్భంగా ప్రస్తుతం ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు 'శ్రామిక ఉత్సవం' పేరుతో వివిధ సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలు జరుగుతున్నాయన్నారు. సినీ నటులు, రచయితలు, కళాకారులు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా పాల్గొంటున్నారన్నారు. అలాగే వచ్చేనెల 4 విశాఖలో కార్మిక ప్రదర్శన, బహిరంగసభలో పెద్దఎత్తున కార్మికులతోపాటు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- పెదబయలు : ఎపి పంచాయతీరాజ్ మినిస్టిరియల్ యూనియన్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జిల్లా సంఘం నాయకులు సిహెచ్ సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిలర్ జిల్లా గంగాధర్ వ్యవహరించారు. మండల నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం కాగా, అధ్యక్షులుగా మండల పరిషత్ ఎఒ ఎల్.పూర్ణయ్య, ఉపాధ్యక్షునిగా విఎస్ఎన్ మూర్తి , కార్యదర్శిగా కె రామమూర్తి, సహాయ కార్యదర్శిగా ఎం జోగారావు, కోశాధికారిగా జిల్లా సిద్దేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లుగా బి ప్రవీణ్‌కుమార్, పి మురళీకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను విశాఖపట్నం జిల్లా నుంచి హాజరైన యూనియన్ నేత ఎల్ సత్తిబాబు అభినందించారు

గీత దాటితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి- చింతపల్లి: నూతన సంవత్సర వేడుకల పేరుతో ఈనెల31న బహిరంగ ప్రదేశాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు, అసాంఘిక చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠినచర్యలు తప్పవని చింతపల్లి సీఐ ఎం. వినోద్‌బాబు హెచ్చరించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.

'అధికారుల నిర్లక్ష్యం వల్లే ఆశ్రమ పాఠశాలల్లో మరణాలు'

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విష్ణుమూర్తి

ప్రజాశక్తి -సీలేరు: అధికారులు నిర్లక్ష్యం వల్లనే ఆశ్రమ పాఠశాలల్లో మరణాలు సంభవిస్తున్నాయని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకర విష్ణుమూర్తి ఆరోపించారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో పూర్తిస్థాయి సిబ్బంది లేరని, సీలేరు, దారకొండ, సప్పర్ల పిహెచ్‌సిలో ఆరకొరక వైద్యసేవలు అందుతున్నాయని ఆరోపించారు. అత్యవసర సమయంలో వైద్యసేవలు పొందాలంటే సీలేరు నుంచి చింతపల్లి వరకూ వెళ్లాల్సి వస్తోందని ఆ రహదారి అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఈ ఘటనకు అధికారులే బాధ్యత వహించాలన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సీలేరు, ధారకొండ, సప్పర్ల వంటి గ్రామాల్లో వైద్యంతో పాటు మౌలిక వసతులు కల్పించని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు కవర్లు భగవాన్ సమావేశంలో పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల సంరక్షణ విభాగ ప్రొటెక్షన్ అధికారి రాజశేఖర్

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి -జికెవీధి: మండలంలోని జీకే వీధి ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలలో నిర్వహించిన 'బాల్య వివాహ ముక్త భారత్' అవగాహన కార్యక్రమం చిన్న వయసులో వివాహం చేసుకోవడం చట్టరీత్యా నేరమని, దీనివల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ అధికారులు కమిటీ రాజశేఖర్, శాంతి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వలసమ్మ అన్నారు. బాల్య వివాహాలతో పాటు, పోక్సో చట్టం పాఠశాల స్థాయి రక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లలకు ఏవైనా సమస్యలు ఎదురైనప్పుడు లేదా బాల్యవివాహాల గురించి సమాచారం తెలిసినప్పుడు ఫిర్యాదు చేయడానికి 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) నంబర్‌ను సంప్రదించాలని వివరించారు. కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలను నియంత్రించండి

ఐద్వా జిల్లా కార్యదర్శి పద్మ

ప్రజాశక్తి-ఎటపాక : డిసెంబర్ 30, 31, జనవరి 1 తేదీల్లో నూతన సంవత్సరం సందర్భంగా మద్యం షాపులకు సాయంత్రం ఏడు గంటల వరకే అనుమతి ఇవ్వాలని, ముందస్తు చర్యల్లో భాగంగా మద్యం విక్రయాలను నియంత్రించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ ఒక ప్రకటనలో కోరారు. మద్యం దుకాణాలు అర్ధరాత్రి కూడా తెరచి ఉంచితే యువత రోడ్లపై విచ్చలవిడిగా ప్రవర్తిస్తారన్నారు. బెల్టుషాపుల్లో కూడా మద్యం ఏరులై పారుతోందని ఎక్సైజ్ అధికారులు చూసీ చూడనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మరోవైపు రాష్ట్రంలో గంజాయి విక్రయాలు విచ్చలవిడగిగా జరుగుతున్నాయన్నారు. గిరిజన మహిళపై కేసులు పెట్టేందుకు ఉన్న అత్యుత్సాహం మద్యం షాపుల నియంత్రణపై ఎందుకు లేదని ప్రశ్నించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: గత వారంలో పిజిఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలు పరిష్కరించాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ సోమవారం సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో వివిధ శాఖలకు సంబంధించిన సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గతవారం ఎన్ని అర్జీలు వచ్చాయి, వాటిని పరిష్కరించారా లేదా అనేది ఆరా తీశారు. పరిష్కారం కాని సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదో తెలియజేయాలన్నారు. ప్రతివారం వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీలు అప్‌లోడ్ చేసిన తరువాత వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఒ జనరల్ డిఎన్‌వి రమణ, పశసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డిఇఒ వై.మల్లేశ్వరరావు, డిఎల్‌డిఒ కె. కోటేశ్వరరావు, ఎడియంహెచ్ఒ డాక్టర్ సరిత, ఎడిఎ రామ్మోహన్, పిహెచ్ఒ దేవదానం, జిసిసి డిఎం జయశ్రీ, పిఏఒ రాంబాబు, తహశీల్దార్ పి.బాలాజీ, ఎంపిడిఒ ప్రసాద్, సిడిపిఒ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ స్మరణ్‌రాజ్

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివకుమార్

విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని రాజీవనం ఎస్ఐ శివకుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాగింగ్ ఫేక్ ఎపికె ఫైల్స్, యాప్స్, ఆన్‌లైన్ బెట్టింగ్, ఈవ్ టీజింగ్,శక్తి యాప్, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వంటి చర్యలకు పాల్పడిన విద్యార్థులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల తెప్పోత్సవం

పూజలు చేస్తున్న సర్పంచ్ సంతోష్‌కుమార్ దంపతులు

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: శ్రీరామగిరి సుందర సీతారామ చంద్రస్వామి తెప్పోత్సవం గోదావరీ పరీవాహక ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భజనబృందాల గీతాలాపన, కోలాటాలు ప్రేక్షకులను కట్టిపడేశాయి. భారీపోలీస్ బందోబస్తు నిర్వహించారు. హంస వాహనంపై స్వామివారిని నదిలో ఊరేగించారు. ఆలయ అర్చకులు పురుషోత్తమాచార్యులు, కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కమ్మ చిచ్చు సత్యనారాయణ, స్థానిక సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ దంపతులు, గుండిపూడి లక్ష్మణరావు, స్థానిక శాఖ కార్యదర్శి ఆత్మకూర్ కాంతారావు, కార్యకర్తలు శ్రీరామగిరి ఆలయ దేవస్థానం చైర్మన్ పెందుర్తి సుదర్శన్ రావు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తున్న చప్ప సత్యనారాయణమూర్తి తన భార్య హేమలత జ్ఞాపకార్థం పాఠశాలకు అవసరమైన సుమారు రూ.10 వేలు విలువ చేసే మొబైల్ మైక్‌సెట్, స్టాండింగ్ ఫ్యాన్ వితరణగా అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను అభినందించారు. ఉపాధ్యాయులు రామానాయుడు, జంగమయ్య, సత్యనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

మైక్ అందిస్తున్న సత్యనారాయణమూర్తి

నూతన సంవత్సర వేడుకలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - జికెవీధి: మండలంలో నూతన సంవత్సర వేడుకలపై నిఘా పెట్టామని, యువత శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ సురేష్ సూచించారు. డిసెంబర్ 31న వేడుకలు జరుపుకునే యువకులు మద్యం తాగి అత్యుత్సాహం ప్రదర్శించి ఇతరులకు ఇబ్బందులు కలిగించినట్టు ఫిర్యాదు అందితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జూదం ఆడినా, మద్యం తాగి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గౌడ కులస్తులకు ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- గంగవరం: గౌడ కులస్తులందరికీ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు తక్షణమే మంజూరు చేయాలని గౌడ సేన జాతీయ అధ్యక్షులు మోర్ల ఏడుకొండలు గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం అమరావతి సెక్రటేరియలో రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ , పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను వారు కలిసి సమస్యను వివరించారు. గౌడ కులస్తులకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు అందించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అవసరమైతే దీనిపై గౌడలందరినీ ఏకం చేసి భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గౌడ సంఘం అధ్యక్షులు మట్ట రామ్మూర్తి నాయకులు మెహర్‌బాబా గౌడ, వంకా పేరయ్య, నండూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని గుంటగన్నెల పంచాయతీ లక్కలో సిపిఫ్ ఆధ్వర్యంలో ఆదివాసి ఆహార ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంట గన్నెల, లైగండ, కుజబంగి గ్రామ పంచాయతీల నుండి 40 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు. సుస్థిర జీవనోపాధి పద్ధతులను ప్రోత్సహించడానికి సి పి ఎఫ్ సంస్థ వర్మీకంపోస్ట్ షెడ్ల నిర్వహణ కోసం ఆకుపచ్చ వస్త్రాన్ని, వర్మీకంపోస్ట్ సంచులను పంపిణీ చేసింది. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ పాడేరు ఆఫీసర్ .లక్ష్మణరావు, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కమల, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శశికుమార్, కమ్యూనిటీ కోఆర్డినేటర్ లక్ష్మి , కోఆర్డినేటర్ మాలతి పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షునిగా సన్యాసిరావు

ప్రజాశక్తి- అనంతగిరి :అల్లూరి జిల్లా టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులుగా డుంబరి సన్యాసిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈనెల 28వ తేదీన జరిగిన మహాసభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి కోటా శ్రీను ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. అనంతరం జిల్లా ఉపాధ్యక్షులుగా తమను ఏకగ్రీవంగా ఎన్నిక పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై పోరాటానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. సన్యాసిరావు ఎన్నికపై ఉపాధ్యాయ సిబ్బంది గురుదొర, మంజునాథ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సందడిగా వనభోజనం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో గురుకులం పాఠశాలలో సోమవారం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణుప్రసాద్ ఆధ్వర్యంలో వనభోజన కార్యక్రమం సందడిగా జరిగింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థుల్లో సమైక్యత స్నేహభావం పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలిపారు. గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ పారయ్య, మినీ గురుకులం పాఠశాల హెచ్ఎం విజయకుమారి సిబ్బంది పాల్గొన్నారు

టిడిపి కార్యకర్తలకు అవార్డులు

ప్రజాశక్తి-హుకుంపేట :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, ప్రజల్లోకి చైతన్యవంతంగా తీసుకెళ్లేందుకు కృషి చేసిన టిడిపి ఉత్తమ కార్యకర్తలకు అవార్డులు అందజేశారు. సోమవారం అరకు టిడిపి ఇన్‌చార్జి, విజయనగరం జోనల్ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర చేతుల మీదుగా అవార్డులు అందించారు. మండల కేంద్రంలోనే స్థానిక టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షులు శతక బొంజుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దొన్నుదొర హాజరయ్యారు. టిడిపి సీనియర్ నాయకులు, బాకూరు సర్పంచ్ వెంకటరమణ మాట్లాడుతూ, కార్యకర్తల పనితీరును బట్టి అవార్డులు ఇవ్వడం అభినందనీయమన్నారు.అనంతరం దొన్నుదొర మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సైనికుల్లా పనిచేసిన కార్యకర్తలకు ఈ అవార్డులు లభించాయన్నారు. ఎంపిటిసి కొమ్మరమ్మ, హుకుంపేట మండల ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు గొల్లూరి సుబ్బారావు, పిపిఎస్ చైర్మన్ అరకు పి.రాము, పార్లమెంట్ కమిటీ సభ్యుడు పాంగి రవీంద్ర, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సూర్యకాంతం పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రంలో తనిఖీలు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బహుళార్థ సాధక స్త్రీ శిక్షణ కేంద్రం (ఫిమేల్ ఎంపిహెచ్‌డబ్ల్యూ)ను సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణమూర్తినాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిక్షణ కేంద్రంలో విద్యార్థినులతో మాట్లాడుతూ, శిక్షణ, పౌష్టికాహారం, అందుబాటులో ఉన్న వసతుల గురించి తెలుసుకున్నారు. విద్యార్థినులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతికుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నవోదయ నమూనా పరీక్ష

ప్రజాశక్తి-జి.మాడుగుల: దిరేస్ అకాడమీ (నర్సీపట్నం) ఆధ్వర్యంలో సోమవారం జి.మాడుగుల మండలంలోని గాంధీనగరం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఏకలవ్య-నవోదయ నమూనా ప్రవేశ పరీక్ష, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల నుంచి 45 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. గాంధీనగరం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మత్స్యరాస మత్స్యరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పరీక్షలో ప్రతిభ కనబరిచిన జగదీష్, గణేష్, దర్శిత, గౌస్మితా శ్రీ, భవిష్య, ప్రవీణ్, మహేంద్ర విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి నమూనా పరీక్షలు విద్యార్థులకు పోటీపరీక్షలపై ముందస్తు అవగాహన కల్పిస్తాయన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడంలో ఇటువంటి పరీక్షలు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ఎస్.రామచంద్రరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.